రుణాలు సకాలంలో అందించాలి

- నిర్దేశించిన లక్ష్యాన్ని గ్రౌండింగ్ చేయాలి
- అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్
- బ్యాంకర్లతో సమావేశం

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్నఅద నపుకలె క్టర్ కుమార్‌దీపక్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 : లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాలు అందించాలని అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యువతకు ఉన్నత విద్య కోసం ఎక్కువ శాతం రుణాలు అందించడం ద్వారా యువత ఉన్నత విద్యా ప్రమాణాలను పొంది బంగారు భవిష్యత్తుకు ఉపయోగపడుతుందన్నారు. రైతులకు పంట రుణాలు, టర్మ్‌లోన్లు, వ్యవసాయ అనుబంధ రుణాలు విరివిగా అందించాలని సూచించారు. పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పరిశ్రమలు, డీఆర్‌డీవో తదితర శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ నిర్మాణం, ఇతర ప్రాధాన్యత రంగాలకు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని కోరారు. చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి అవగాహన కలిగిస్తూ రుణాలు అందించాలని కోరారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిర్ణీత గడువులోగా రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి తప్పనిసరిగా బ్యాంకర్లు బెనిఫిషరీ మీటింగ్ ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తిస్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద దరఖాస్తు చేసుకునే చేతివృత్తుల వారికి సత్వరమే రుణ సదుపాయం కల్పించాలన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 : ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. 1964లో ప్రారంభించిన కళాశాల శిథిలావస్థకు చేరుకున్నదని, త్వరలోనే పునర్నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కళాశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి కృషి చేశారని గుర్తుచేశారు. చేశారు. కార్యక్రమంలో ఇంటర్‌బోర్డు నోడల్ ఆఫీసర్ వెంకరమణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ..

తెలకపల్లి, ఫిబ్రవరి 22 : మండలంలోని పెద్దపల్లిలో గురువారం ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులకు సంబంధించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి

- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, ఫిబ్రవరి 22 : అచ్చంపేట మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం అచ్చంపేట మున్సిపల్ బడ్జెట్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, జిల్లా అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ పాల్గొన్నారు. మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు సకాలంలో ఇంటిపన్ను, నల్లా బిల్లులు చెల్లించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహ్మగౌడ్ మాట్లాడుతూ సంత నిర్వహణ కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న మున్సిపల్ కాంప్లెక్స్ వెనుకభాగంలో ఖాళీ స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయిచాలని కోరారు. కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొన్న సమస్యలు ప్రస్తావించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్యాంసుందర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

బ్యాటింగ్ చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

బిజినేపల్లి, ఫిబ్రవరి 22 : క్రీడలతో ఆరోగ్యంతోపాటు మానసికోల్లాసం పెంపొందుతుందని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. గురువారం మండలంలోని పాలెం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నాన్ టీచింగ్ సిబ్బందికి వాలీబాల్, క్రికెట్, చెస్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడి ఉండడం వల్ల ఆరోగ్యం విషయంలో చాలా మంది శ్రద్ధ వహించడం లేదన్నారు. వ్యాయామం, క్రీడలతో రోగాలు దరిచేరవన్నారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటరమణ, వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ పుష్పావతి, ఏడీఆర్ మల్లారెడ్డి, కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 22: పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని డీఈవో గోవిందరాజులు, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ విద్యార్థులకు సూచించారు. గురువారం కల్వకుర్తి పట్టణంలో జిల్లా విద్యాశాఖ, కల్వకుర్తి సేవ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ పబ్లిక్ స్కూల్స్, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

బహిరంగ ప్రకటన తేది: 22.02.2024
నేను మేకల శ్రీనివాస్ తండ్రి మేకల బాలయ్య, వృత్తి: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, నివాసం: ఇ.నెం. 14-4-160, వెంకటేశ్వర నిలయం, గ్రామ పంచాయతి, దొడ్డలోనిపల్లి, H/o బోయపల్లి గ్రామ శివారులో గల భూమి సర్వే నం. 155/ఇ లో గల ప్లాటు యొక్క వైశాల్యం 200.0 చ॥గ॥ల ప్లాటుకు సంబంధించిన డాక్యుమెంట్ నం 2855/2006, రిజిస్టర్ విక్రయ దస్తావేజులు రిజిస్ట్రేషన్ ఆఫీస్ నుంచి నా ఇంటికి ఆటోలో వెళ్తున్నప్పుడు ఎక్కడో పడిపోయాయి, ఇట్టి డాక్యుమెంట్ ఎవరికైన దొరికినో క్రింది అడ్రసుకు సంప్రదించగలరు, ఇట్టి డాక్యుమెంట్ తెచ్చిన వారికి తగిన పారితోషికము ఇవ్వబడును. సం॥ మేకల శ్రీనివాస్ తండ్రి మేకల బాలయ్య, R/o ఇ.నెం. 14-4-160, వెంకటేశ్వర నిలయం భగీరథ కాలనీ, మహబూబ్‌నగర్, సెల్: 8639121387

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం

వెల్దండ, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో మధ్య దళారులు, ప్రైవేటు వ్యక్తుల పెత్తనంతో అమాయక రైతులు అన్యాయానికి గురవుతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎస్‌బీఐలో రైతులు నేరుగా క్రాప్‌లోన్‌కు దరఖాస్తులు చేసుకుంటే నెలలు గడిచినా రుణాలు మంజూరు కావడం లేదని, అదే దళారులను, కొంత మంది ప్రైవేటు వ్యక్తులను మధ్యవర్తిగా పెట్టుకుంటే మాత్రం మూడు నుంచి నాలుగు రోజుల్లోనే రుణాలు మంజూరవుతున్నాయని మండల కేంద్రానికి మాజీ సైనికుడు, రైతు మట్ట చంద్రశేఖర్ సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. దీనిపై ఎస్‌బీఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇప్పటికైనా స్థానిక బ్యాంక్ అధికారులు తమ తీరును మార్చుకోవాలని రైతులు కోరుతున్నారు.

స్వయం పరిపాలనా దినోత్సవం

ఉపాధ్యాయులతో విద్యార్థులు

తాడూరు, ఫిబ్రవరి 22 : మండలంలోని గోవిందాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా రజిత, డీఈవోగా అర్జున్, ఎంఈవోగా జీవిత, హెచ్‌ఎంగా కీర్తి వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరంగాపూర్ ఆలయాన్ని సందర్శించిన విద్యార్థులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 22 : విద్యా క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులు వనపర్తి జిల్లాలో చారిత్ర కట్టడమైన శ్రీరంగాపూర్‌లో రంగనాథస్వామి ఆలయాన్ని ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. ఆలయ ఆవశ్యకత, చరిత్ర, పురాతన కట్టడాల గురించి వివరించారు.

అన్నదాతలపై దాడులు సరికాదు

కల్వకుర్తి, ఫిబ్రవరి 22: ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడులను నిలిపివేయాలని కోరుతూ కల్వకుర్తి తాలుకా రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్టీవో శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల డిమాండ్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 22: పశువులకు థైలేరియా సోకకుండా ముందు జాగ్రత్తగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశువైద్యుడు శ్రీనాథ్ అన్నారు. గురువారం మండలంలోని గుండూరులో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో 201 పశువులకు థైలేరియా వ్యాధి నివారణ టీకాలు వేశారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 : జిల్లా కేంద్రంలోని శశి ఆర్థోపెడిక్ దవాఖానలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్ గురువారం తనిఖీ చేశారు. ఇటీవల కాలంచెల్లిన మందులు ఇవ్వడంతో అనారోగ్యానికి గురైన బాధితుడి బంధువులు దవాఖాన ఎదుట ఆందోళన నిర్వహించడంతో ఆయన తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో ఉన్న అన్ని మందులను పరిశీలించారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 22 : మండలంలోని అమ్మపల్లిలో దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. సామాజిక వర్గానికి సంబంధించి చేసుకున్న ఒప్పందాన్ని అతిక్రమించారంటూ శ్రీనివాసులు అనే వ్యక్తి ప్రశ్నించగా, అతడి బంధువు ఒకరు దాడి చేయడంతో తలకు గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వెల్దండ, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఎంజీకాలనీ తండాలో ఎంపీటీసీ చిట్టి కాడురాంనాయక్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

యాదవ కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలి

ఉప్పునుంతల, ఫిబ్రవరి 22 : కాంగ్రెస్ ఎన్నికల ముందు యాదవులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని, హామీని అమలు చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శంకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఉప్పునుంతలలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఇన్నాళ్లైనా హామీ అమలు దిశగా ఊసేలేదన్నారు. వెంటనే ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేయాలని కోరారు.

కొల్లాపూర్ ఇన్‌చార్జి ఎంపీపీ రాజీనామా

కొల్లాపూర్, ఫిబ్రవరి 22 : కొల్లాపూర్ మండల ప్రజా పరిషత్ ఇన్‌చార్జి అధ్యక్షుడిగా కొనసాగుతూ వచ్చిన (మొలచింతపల్లి ఎంపీటీసీ) సభావట్ భోజ్యానాయక్ వ్యక్తిగత కారణాలతో గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు కలెక్టర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయ అధికారికి రాజీనామా లేఖను అందజేసినట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా ఈ ఎంపీపీ స్థానం మహిళ జనరల్‌కు కేటాయించారు. అప్పట్లో సింగవట్నం నుంచి ఎంపీటీసీగా బీఆర్‌ఎస్ నుంచి గెలిచి ఎంపీపీ పీఠాన్ని చేజిక్కించుకున్న సుధారాణి రెండేండ్ల కిందట వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ ఎంపీపీగా కొనసాగుతూ వచ్చిన సభావట్ భోజ్యానాయక్‌ను ఇన్‌చార్జి ఎంపీపీగా పీఠాన్ని ఎక్కారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరగా, ఈనెల 6వ తేదీన బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఆర్డీవో నాగరాజుకు లేఖ అందజేశారు. దీంతో ఇన్‌చార్జి ఎంపీపీతోపాటు వైస్ ఎంపీపీ పదవి ఊడగొట్టడం ఖాయమని ముందుగానే భావించి భోజ్యానాయక్ విధిలేని పరిస్థితిలో తన పదవికి రాజీనామా చేయక తప్పలేదు.

మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలుస రికాదు..

తన ఇన్‌చార్జి ఎంపీపీ పదవికి రాజీనామా చేసిన భోజ్యానాయక్ గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడాన్ని బీఆర్‌ఎస్ గిరిజన ఎంపీటీసీలు శంకర్‌నాయక్, పాండునాయక్ ఖండించారు. రాజకీయంగా ఎదిగేందుకు సహకారం అందించిన బీరంపై నోటికొచ్చినట్లు మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామన్నారు. అసమర్థతను కప్పిపుచ్చుకోవడం కోసం మాజీ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మాట్లాడడాన్ని తప్పుబట్టారు.

ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసిన కలెక్టర్

కొల్లాపూర్, ఫిబ్రవరి 22 : కొల్లాపూర్ ఎంపీపీ అధ్యక్ష పదవి ఎన్నిక కోసం కలెక్టర్ ఉదయ్‌కుమార్ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఎంపీడీవో పట్టాభి రామారావు గురువారం తెలిపారు. ఇది వరకు ఎంపీపీగా ఉన్న సుధారాణి తన వ్యక్తిగత కారణాలతో 2020 సెప్టెంబర్ 9వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో నాటి నుంచి ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్న వైస్ చైర్మన్ భోజ్యానాయక్ రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. పరోక్షంగా జరిగే ఎన్నిక నిర్వహణ కోసం గజిటెడ్ ఆఫీసర్‌ను కలెక్టర్ నియమించనున్నారు. ఈనెల 24వ తేదీన ప్రత్యేక మీటింగ్ నిర్వహించేందుకు ఎంపీటీసీ సభ్యులకు నోటీసులను జారీ చేయనున్నారు. 28న నామినేషన్ ప్రక్రియ అనంతరం ఎంపీపీ ఎన్నిక పరోక్ష పద్ధతిలో జరుగనున్నదని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వర్గాలు తెలిపాయి.

ఆపదలో అండగా నిలిచేందుకే షీటీం

మాట్లాడుతున్నఅద నపుఎస్పీరా మేశ్వర్‌రావు

బిజినేపల్లి, ఫిబ్రవరి 22 : మహిళల రక్షణకోసం షీటీమ్ ఎల్లవేళలా కృషి చేస్తున్నదని అదనపు ఎస్పీ రామేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణకోసం 1098 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్ అధికారి విజయలక్ష్మి, ఎస్సై రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

సూరాపూర్‌లోవరి ప ంటలనుప రిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

లింగాల, ఫిబ్రవరి 22 : యాసంగిలో సాగు చేసిన వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేట్టాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సూరాపూర్ శివారులో సాగుచేసిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 2,450 ఎకరాల్లో వరిపంట సాగు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పిలకల దశలో ఉందని, కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎకరాకు 35కిలోల యూరియా, కర్తాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 5కిలోల చొప్పున చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో చీన్యనాయక్ ఉన్నారు.

వరి పంటల పరిశీలన

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 22 : మండలంలోని ఎల్లూరులో గురువారం మండల వ్యవసాయ అధికారులు వరి పంటలను పరిశీలించారు. రైతు నక్క బాలస్వామి వరి పంటను ఏఈవో మౌనిక పరిశీలించి సూచనలు చేశారు. ఎల్లూరు రిజర్వాయర్ కింద సాగు చేస్తున్న వరి పంటలు పిలక దశలో ఉన్నాయని, ప్రస్తుతం వేరు కుళ్లు తెగులు వచ్చే అవకాశం ఉన్నందునా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఈవో వెంట రైతులు శేఖర్, రవీందర్‌రెడ్డి, ఈశ్వరయ్య, శేషిరెడ్డి ఉన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 22: మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య శాఖ కమిషనర్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కల్వకుర్తి మండలం రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలియో చుక్కల పంపిణీకి వైద్య సిబ్బంది ఏర్పాటు, చిన్నారుల గుర్తింపుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలోవైద్యురాలు రజిత, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

పెంట్లవెల్లి:వేం కటేశ్వరస్వామి కల్యాణంని ర్వహిస్తున్నవేద పండితులు

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 22: కల్వకుర్తి మండలం రఘుపతిపేట అనుబంధ గ్రామం రామగిరి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అశేష జనవాహిని మధ్య సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కనులప ండువగా..

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలో వెలిసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజుల నుంచి బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ జీవన్‌కుమార్ వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామి కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కనులపండువగా జరిగింది. అనంతరం భక్తులకు పట్టణానికి చెందిన వేముల శేఖర్‌శెట్టి అన్నదానం చేశారు. కాగా, 24వ తేదీన రథోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 22 : మండలంలోని దేవునితిర్మలాపూర్ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవరోజు హనుమంతు సేవలో వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు పల్లకీలో స్వామిని ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యం, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు ఆంజనేయులు, ఈశ్వర్ ఉన్నారు.

24న ఆర్థిక అక్షరాస్యతపై వ్యాసరచన పోటీలు

- కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 : ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్, సైబర్ పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఈనెల 24వ తేదీన 8,9వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న 8,9 తరగతి విద్యార్థులకు 'రాత్రికి రాత్రే నేను మిలీనియర్‌గా మారితే ఆ డబ్బులను ఎలా వినియోగిస్తారు'అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించాలన్నారు. పొదుపు, చక్రవడ్డీ శక్తి పెంపు అవగాహన కోసం స్లోగన్ పోటీలను నిర్వహించాలని, డిజిటల్, సైబర్, పరిశుభ్రతపై పోస్టర్ కాంపిటీషన్లను ఈనెల 24వ తేదీన నిర్వహించాల పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి అత్యుత్తమమైన వ్యాసరచన, స్లోగన్స్, పోస్టర్‌ను ఎంపిక చేసి అదేరోజు సాయంత్రం 5గంటల్లోగా జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డికి అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

విదేశీ ఉన్నత విద్యకోసం దరఖాస్తు చేసుకోవాలి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 : మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే మైనార్టీ విద్యార్థులు(ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన, బుద్దిస్ట్, పాలసి) ముఖ్యమంత్రి విదేశీ విద్యాపథకం(సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం) కింద దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి గోపాల్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ(ఇంజనీరింగ్)లో 60శాతం మార్కులు ఉండి పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యను అభ్యసించే వారు, పీజీలో 60శాతం మార్కులు వచ్చి పీహెచ్‌డీ చేయాలనుకునేవారు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందే విద్యార్థులు ఫాల్ సీజన్ 2023 (ఆగస్టు 1 నుంచి 31 డిసెంబర్ 2023) వరకు ఎంపిక చేయబడిన విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొంది ఉండాలన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు ధ్రువపత్రాలతో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తును ఈనెల 20వ తేదీ ఉదయం 11గంటల నుంచి మార్చి 20వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ధ్రువపత్రాలను గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి ఈపాస్ ఐడీయుక్తంగా మార్చి 30వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి కార్యాలయం రూమ్ నెంబర్ 5-25లో సమర్పించాలన్నారు. ఈ పథకంకోసం దరఖాస్తు చేసేందుకు అర్హతలు, ఇతర వివరాల కోసం www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నల్లమలలో ఆరిన మంటలు

అచ్చంపేట, ఫిబ్రవరి 22: నల్లమల అటవీప్రాంతంలో రెండు రోజులుగా చెలరేగిన మంటలను గురువారం అదుపులోకి తెచ్చినట్లు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి తెలిపారు. నల్లమలలోని భౌరాపూర్, రాంపూర్, ఫరహాబాద్ ప్రాంతాల్లో మంటలు వ్యాపించినట్లు పేర్కొన్నారు. 15మంది ఫైర్ వాచర్లు, 16మంది బేస్‌క్యాంప్ వాచర్లు మంటలను ఆర్పినట్లు చెప్పారు. దాదాపు 8హెక్టర్లలో అడవి దగ్ధమైందని, యాత్రికులు, ఇతరులు సిగరేట్లు, బీడీలు కాల్చి అడవిలో పడేయడం వల్ల మంటలు వ్యాపిస్తున్నాయని వెల్లడించారు. మంటలు అదుపు చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడో చోటా కార్చిచ్చు వల్ల అడవి దగ్ధమవుతుందని రేంజర్లు, సెక్షన్ అధికార్లు, వాచర్లు అందరూ ఎవరి సెక్షన్లలో వారు నిఘా ఉంచాలని, అడవుల్లోకి వెళ్లే వారు అటవీ అధికారులకు సహకరించాలని కోరారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయాలి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 : దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా వికలాంగుల విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నిరంజన్ అన్నారు. జిల్లాకు కొత్తగా వచ్చిన వికలాంగుల సంక్షేమశాఖ అధికారి రాజేశ్వరిని గురువారం ఐడీవోసీలోని అధికారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చేలా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

కొల్లాపూర్, ఫిబ్రవరి 22 : కాంగ్రెస్ ప్రకటించిన హామీ ప్రకారం 25వేల పోస్టులతో వెంటనే మెగా డీఎస్సీని వేయాలని బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకుడు శేఖర్ సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం నాయకులు ఫయాజ్, ఫయాజ్‌తో కలిసి బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుమారు 13,500 పైచిలుకు పోస్టులను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలతో సంబంధం లేకుండా, మూతపడిన ప్రాథమిక పాఠశాలలను తెరిచి వాటిని కలుపుకొని 25వేలతో మెగా డీఎస్సీని వెంటనే వేయాలన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడితే సహించేదిలేదని హెచ్చరించారు. మెగా డీఎస్సీ ప్రకటించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

మొక్కలను సంరక్షించాలి

వెల్దండ, ఫిబ్రవరి 22: మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దాపూర్, బర్కత్‌పల్లి గ్రామంలో డంపింగ్‌యార్డ్, వన నర్సరీ, క్రీడా ప్రాంగణాలను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

అచ్చంపేట, ఫిబ్రవరి 22 : అచ్చంపేట తాసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని తాసీల్దార్ మురళీమోహన్ అన్నారు. గురువారం అచ్చంపేట తాసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

కరపత్రాల ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 22 : ఆంధ్ర మాల మహానాడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడలో ఈనెల 25న నిర్వహించనున్న సభకు సంబంధించిన కరపత్రాలను సంఘం నాయకులు గురువారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు.